ప్రజలకు అందుబాటులో ఉంటేనే గెలిపించండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులనే గెలిపించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్ వద్ద బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి వాకర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాకర్స్ మినీ ట్యాంక్ బండ్ పైన ఉన్న సమస్యలను నాయకులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారంలో పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఇందుకోసం ప్రజలు కూడా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇంటి యజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఆస్తి పన్ను, వృత్తివ్యాపార లైసెన్స్ ఫీజులు మార్చి 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తామన్నారు. మరో మూడు రోజుల గడువు మిగిలి ఉందని, మున్సిపల్ అధికారులు సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆన్‌లైన్ లేదా నగరపాలక సంస్థ పౌరసేవా కార్యాలయంలో పన్నులు చెల్లించాలని కోరారు. సకాలంలో పన్నులను చెల్లించి నగర పాలక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రాయితీకి 31 చివరి రోజు..

ఉప్పల్: పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నుపై విధించిన ఫైన్‌లో 90 శాతం వరకు తగ్గించి చెల్లించడానికి ఈ నెల 31 లోపు చెల్లించాలని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అంజనేయులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



నీటి బోరును పరిశీలిస్తున్న కమిషనర్ రామలింగం

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఆయన గురువారం వాటర్ పైపులైన్ లీకేజీలు, నీటి బోరులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీరు, బోర్ వాటర్ సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా బోర్ మోటార్ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ షోరూం పునఃప్రారంభం



వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న సినీ నటి నిధి అగర్వాల్

ఉప్పల్: స్థానిక వరగంల్ జాతీయ రహదారిలోని సీఎంఆర్ వస్త్ర దుఖాణాన్ని సినీనటి నిధి అగర్వాల్ గురువారం పునఃప్రారంభించారు. గతంలో ఏర్పాటు చేసిన ఈ షాపింగ్‌మాల్ అగ్ని ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. కాగా, అన్ని రకాల వస్త్రాలు అందుబాటు ధరల్లో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఆటో దొంగ అరెస్ట్



వీరేష్ కుమార్

పోచారం: ఆటో దొంగిలించిన వ్యక్తిని పోచారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలో నానావత్ చందర్(52) ఈనెల 26న తన ఇంటి వద్ద ఆటో నిలిపాడు. మరుసటి రోజు ఉదయం తన ఆటో కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేసిన పోలీసులకు ఆటోను దొంగిలించిన వ్యక్తి సాయిరెడ్డిగూడెంకు చెందిన వీరేష్ కుమార్ (27)గా గుర్తించారు. వీరేష్‌ను అరెస్ట్ చేసి విచారించగా ఆటోను తానే దొంగిలించినట్టు ఒప్పుకున్నాడు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి



బక్కోళ్ల నర్సింహులు (ఫైల్)

శామీర్‌పేట్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామానికి చెందిన బక్కోళ్ల నర్సింహులు(50), మూడుచింతలపల్లి మండంలం ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన యాంజాల నరేశ్ ద్విచక్ర వాహనాలపై బుధవారం రాత్రి వస్తున్నారు. కొల్తూర్–బొమ్మరాశిపేట గ్రామాల మధ్యలో ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టుకున్నారు. ప్రమాదంలో నర్సింహులుకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

క్లీన్‘స్వీప్’ కోసం..

- ఎన్నికల్లో యువత వందశాతం పాల్గొనేలా కార్యాచరణ
- ‘స్వీప్’ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహణ
- జిల్లా నోడల్ అధికారి సాంబశివరావు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికలలో యువత వంద శాతం ఓటు నమోదు చేసేలా స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి సాంబశివరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 5 నియోజకవర్గాలలో స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందుకోసం స్వీప్ కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఓటు హక్కుపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్వీప్ ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఓటు వేసేలా క్యాంపస్ అంబాసిడర్లు అవగాహన కల్పించాలన్నారు.

◆ ఎన్నికల వేళ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా అభ్యర్థులను ఎన్నుకుంటే బాధ్యత గల నాయకుడికి అధికారం వస్తుందన్నారు. సి–విజిల్ యాప్లో ఫిర్యాదులు చేయడం ద్వారా వంద నిమిషాలలో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా, ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటు ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ కృష్ణారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగాలి

లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి పార్లమెంట్ జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం 12ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు గాను సీఈఓ కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉన్న పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన వివరాలను ఎస్‌ఐసీ ద్వారా పొందుపరిచి.. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈక్రమంలో ప్రతి జిల్లా అధికారి తమ కార్యాలయ సిబ్బందితో సహా తమ వివరాలు పొందుపరిచే బాధ్యత కార్యాలయ అధికారి, నోడల్ అధికారిదేనని కలెక్టర్ స్పష్టం చేసారు. మే 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీసులకు, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి.. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓట్ వేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజురు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ విద్యార్థులకు రొబోటిక్స్‌లో ఉద్యోగావకాశాలు



సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులతో ప్రొఫెసర్ శివరామకృష్ణ తదితరులు

ఘట్‌కేసర్: రోబోటిక్స్ రంగంలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎల్.శివరామకృష్ణ అన్నారు. గురువారం వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ‘రోల్ ఆఫ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇన్ రొబోటిక్స్’ అంశంపై రొబోటిక్స్ క్లబ్, ట్రిపుల్‌ఈ రాస్ అండ్ ఎస్టీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో రొబోటిక్స్ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస చలపతి, అధ్యాపకులు డా.మదన్ మోహన్‌రెడ్డి, డా.ఎస్.జష్ కుమార్, టీఎస్ రవికాంత్, ఏఎం తనూజ తదితరులు పాల్గొన్నారు.

‘ఎల్‌ఐజీ’లో పరిశుభ్రత కార్యక్రమం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో పరిశుభ్రత కార్యక్రమం గురువారం నిర్వహించారు. కాలనీ సొసైటీ విజ్ఞప్తి మేరకు మున్సిపల్ అధికారులు జేసీబీని పంపించి పరిసరాలను శుభ్రం చేయించారు. అలాగే, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సొసైటీ నిధులతో కాలనీలో చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

కీసర: స్థానిక గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం కీసరగుట్టలో గురువారం పోచమ్మ, ఎల్లమ్మ, ఈదమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పండితుల సమక్షంలో మొదటిరోజు పూజా కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. అనంతరం చేపట్టిన అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపులో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేశ్ గుప్తా, నేతలు నాయకపు వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు శమంత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల కోసం అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న యూనివర్సిటీ వీసీ, జెనెటిక్ రిసార్సెస్ ఇన్‌చార్జి

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ గురువారం భారత వ్యవసాయ మండలి సంస్థ(నేషనల్ బ్యూరో ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ వీఎస్‌కే రెడ్డి, జెనెటిక్ రిసోర్సెస్ ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జి శివరాజ్ ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్, రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ తదితరాలలో పరిశోధన, శిక్షణ ప్రయోజనాల కోసం అగ్రికల్చర్ విద్యార్థులకు ఈ ఎంఓయూ ఉపయోగకరంగా ఉంటుందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆంజనేయులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ డీన్ రాజారెడ్డి, శాస్త్రవేత్తలు శర్వానన్, ఎంవీ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతు పలికిన రజక జేఏసీ



సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న నాయకులు

మేడ్చల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో రజక జేఏసీ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతు పలికారు. ఈమేరకు రాష్ట్ర రజక జేఏసీ అధ్యక్షుడు పంజగారి ఆంజనేయులు నేతృత్వంలో సునీతను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతేకాకుండా కాంగ్రెస్ తరుపున నియోజకవర్గంలో ప్రచారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రవితేజ, పోచయ్య, రవి, శేఖర్,కృష్ణ, శంకర్ తదితరులున్నారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో నిధులు గోల్‌మాల్!

ఆడిట్ రూ.26 లక్షలు దుర్వినియోగమైనట్టు సమాచారం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ వార్షిక లెక్కల(ఆడిట్)తో ఓ విభాగంలో లక్షల రూపాయాల నిధుల గోల్‌మాల్ జరిగినట్టు అధికారులు గుర్తించినట్టు సమాచారం. మేడ్చల్ మున్సిపాలిటీలో నెల రోజులుగా వార్షిక లెక్కలు ఆడిట్ అధికారులు రూ.26 లక్షలు గోల్‌మాల్ అయినట్టు గుర్తించగా అందులో రూ.15 లక్షలు రికవరీ చేసినట్టు తెలిసింది. మున్సిపల్‌లోని సిటిజన్ సర్వీస్ సెంటర్ విభాగంలో ఈ అవినీతి జరిగినట్టు ఆడిట్ అధికారులు వారం రోజుల క్రితమే గుర్తించారని సమాచారం. సెంటర్‌కు వివిధ రూపాల్లో ప్రతినెలా రూ.5లక్షల ఆదాయం వస్తోంది. ఇలా వచ్చిన సొమ్మును మున్సిపల్ ఖాతాలో జమచేయాలి. కాగా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గత మూడేళ్లుగా ప్రతినెలా వచ్చే రూ.5 లక్షలకు బదులుగా రూ.4.50 లక్షలు మున్సిపల్ ఖాతాలో జమ చేస్తూ మిగిలిన రూ.50 వేలు దుర్వినియోగం చేస్తున్నారు. సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను మున్సిపల్ మేనేజర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా.. మేనేజర్లు పట్టించుకోకపోవడంతో ఈ తంతు జరిగింది. గతంలోనే ఆడిట్ అధికారులు, ఉన్నతాధికారులకు విషయం తెలిసినా బయటకు రానివ్వలేదు. తాజాగా రూ.26 లక్షలు గోల్‌మాల్ విషయం తెలియడంతో సదరు వ్యక్తులు రూ.15 లక్షల చెల్లించి మిగతావి చెల్లించేందుకు ప్రయత్నిస్తున్న తెలిసింది. నిధుల గోల్‌మాల్‌కు సంబధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియలేదని మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. ఆడిట్ రిపోర్టులో నిధుల గోల్‌మాల్ జరిగినట్టు రుజువైతే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఘనటపై కేసు నమోదైనట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పోచారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోచారం సీఐ రాజు తెలిపిన వివరాలు.. మేడిపల్లికి చెందిన కర్రె యాదమ్మ(80) తన మనవరాలితో కలిసి ఆటోలో యంనంపేట్‌లోని తన సోదరుడు ఇంటికి బుధవారం సాయంత్రం వచ్చారు. యంనంపేట్‌లోని శ్రద్ధ ఆస్పత్రి వద్ద ఆటో దిగగా.. రాంపల్లి నుంచి ఘట్‌కేసర్ వైపు వస్తున్న ఆటో యాదమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలవడంతో శ్రద్ధ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మేడిపల్లిలోని అపెక్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం యాదమ్మ మృతి చెందారు.

బీజేపీలో చేరిన కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు గురువారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పూడూర్ గ్రామ పరిధిలోని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సాకరబోయిన రజితవెంకటేశ్‌తో పాటు నాయకులు నాగరాజు, సురేశ్, ఆంజనేయులు, పలువురు యువకులకు ఈటల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ సరస్వతి, నాయకులు కృష్ణాగౌడ్, నారెడ్డి నందారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల



డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగహన కార్యక్రమం

కీసర: విద్యార్థులు, యువత డ్రగ్స్‌తో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అశోక్ సూచించారు. గురువారం భోగారం గ్రామంలోని గురుకుల విద్యాలయంలో ఫ్రీ డ్రగ్ సిటీ– ఫ్రీ డ్రగ్ తెలంగాణలో భాగంగా డ్రగ్ అబ్యూస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని కొంతమంది విద్యార్థులు ఎల్‌ఎస్‌డీ, గంజా లాంటి మత్తు పదార్థాలకు ఎక్కువగా అడిక్ట్ అవుతున్నారని పోలీస్ కమిషనరేట్ నివేదికల్లో వెల్లడైందన్నారు. మత్తుపదార్థాలకు బానిసైతే మానసిక ఒత్తిడితో పాటు శారీరకంగా నష్టం జరుగుతుందన్నారు. విద్యార్థి తోటి స్నేహితులతో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై ఫౌండేషన్ డిజైన్ చేసిన పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి అశోక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వందన, సుదర్శన్, విఘ్నేశ్వరి, అనూరాధ, వినోద్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు సి.హెచ్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వార్షికోత్సవం

మేడ్చల్: పట్టణ పరిధిలోని కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంఆర్‌ఈఎం 16వ వార్షికోత్సవం గురువారం ఉల్లాసంగా జరిగింది. విద్యార్థులు ఆద్యంతం ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, జాతీయ సాంకేతిక విద్యా సొసైటీ అధ్యక్షుడు కేటా సాహెబ్ దేశాయ్, ఎన్నికల కార్యదర్శి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 19న విడుదల కానున్న శశివదనే సినిమా టీజర్ వార్షికోత్సవంలో విడుదల చేశారు. ఇందులో హీరో రక్షిత్, హీరోయిన్ కోమలి ప్రసాద్, చిత్ర బృందం పాల్గొన్నారు.





విద్యార్థుల ప్రదర్శనలు, టీజర్ విడుదల చేస్తున్న శశివదనే సినిమా హీరో, హీరోయిన్లు

గెలిచినా ప్రవర్తనలో మార్పు రాదు

మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్



రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఉప్పల్, రామంతాపూర్: ‘మాజీ సీఎం కేసీఆర్‌కు కళ్లు నెత్తికెక్కడానికి ఐదేళ్లు పడితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మూడు నెలల్లోపే కళ్లు నెత్తికెక్కాయి’ అని మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రామంతాపూర్ పాలిటెక్నిక్, ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో వాకర్స్, ప్లేయర్ల కలిసి కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ఒక్కసారి ఓడిపోగానే బీఆర్‌ఎస్ పరిస్థితి పూర్తిగా దిగజారిందన్నారు. ప్రజలతో ఆ పార్టీకి పూర్తిగా సంబంధాలు తెగిపోయాయని విమర్శించారు. ఇటీవల జరిగిన మొదటి శాసనసభ సమావేశాల్లో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల వల్ల ఉద్యోగులకు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఆ పార్టీ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ, అమితాషా, నడ్డా ఆశీర్వాదంతో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్నానని స్పష్టం చేశారు. కొట్లాడే సమయంలో ఎలా ఉన్నానో.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే విధంగా ఉంటానని ఈ సందర్భంగా ఈటల హామీ ఇచ్చారు. ఆరు నెలల తర్వాత ఆరు గ్యారంటీలపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లపై కేసు నమోదు



జవహర్‌నగర్‌లో ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తున్న మేయర్ శాంతి(ఫైల్)

జవహర్‌నగర్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన జవహర్‌నగర్ మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో పాటు ఐదుగురు కార్పొరేటర్లపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ ఉత్తర్వుల దిక్కరణ కింద గురువారం వీరిపై జవహర్‌నగర్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, ఆర్వో ప్రభాకర్ గురువారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించడమే కాకుండా ఆసరా పింఛన్లు పంపిణీ చేశారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సైతం సామాజిక మాధ్యమాల్లో ఉన్నాయన్నారు. దీంతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించిన మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు శారద, లావణ్య, నాగరాణి, పల్లపు రవి, ప్రేమల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అడ్డా

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఉప్పల్: మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునితామహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందన్నారు. చెక్కు చెదరని కార్యకర్తలు, పోరాటపటిమగల నేతలు ఇక్కడ ఉన్నారని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అధికారంలో ఉన్నా ఇక్కడ నుంచి రేవంత్ రెడ్డిని గెలిపించి ఢిల్లీకి పంపిన ఘనత ఉందని గుర్తుచేవారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం.. ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉప్పల్ భగాయత్‌లో జరిగింది. కార్యక్రమానికి మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా హాజరై సునితా మహేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. అనంతరం సునితామహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మీ ఆడపడుచుగా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్లు పావని రెడ్డి, ధన్‌పాల్ రెడ్డి, అంజిరెడ్డి, సీతారాం రెడ్డి, తౌఫిక్, బజారు జగన్, తెల్కల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.